క్లుప్తంగా

నేడు, రేపు జగనన్న స్వచ్ఛ సంకల్పంపై శిక్షణ

రామచంద్రపురం రూరల్: జిల్లా జెడ్పీ సీఈఓ ఎన్‌వీవీ సత్యనారాయణ ఆదేశాల మేరకు మండలంలోని వెల్ల చెత్త సంపద కేంద్రం వద్ద నేడు, రేపు ప్రజా ప్రతినిధులు, అధికారులకు జగనన్న స్వచ్ఛ సంకల్పంపై శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పంచాయతీ కార్యదర్శి రాయుడు మోహన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 23న రామచంద్రపురం మండలం ఆదివారపుపేట, కాపవరం, మండపేట మండలం వై.సీతానగరం, మెర్నిపాడు, కె.గంగవరం మండలం గంగవరం, దంగేరు గ్రామాలకు అదే విధంగా 24న కొత్తపేట మండలం కండ్రిగ, గంటి, పి.గన్నవరం మండలం నాగుల్లంక, జి.పెదపూడి, ఆత్రేయపురం, పేరవరం, ర్యాలి గ్రామాల ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, ఉపసర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, అగ్రికల్చరల్ అసిస్టెంట్లు, వెటర్నరీ అసిస్టెంట్లు, గ్రేడ్–5 కార్యదర్శులు, ఆయా మండలాల ఎంపీపీలు, వైస్ ఎంపీపీలు, జెడ్పీటీసీలు, ఎంపీడీఓలు, ఈఓపీఆర్డీలు, శానిటేషన్ సిబ్బందికి ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు శిక్షణ కొనసాగుతుందన్నారు. తప్పనిసరిగా అందరూ హాజరు కావాలని కోరారు.

పేదల కళ్లల్లో ఆనందమే ప్రభుత్వ ధ్యేయం


కోరుమిల్లి జగనన్న కాలనీ శంకుస్థాపనలో ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు

కపిలేశ్వరపురం: కనీస అవసరాలను తీర్చడం ద్వారా పేదల కళ్లల్లో ఆనందాన్ని చూడడమే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అన్నారు. కోరుమిల్లి జగనన్న కాలనీలో బుధవారం లబ్ధిదారులు తమకు కేటాయించిన ప్లాట్లలో ఇంటి నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసుకున్నారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్సీ తోట మాట్లాడుతూ పేదల జీవితకాల కోరిక సొంతింటి కలను నెరవేర్చడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఆ దిశగా అనేక గ్రామాల్లో ప్రైవేటు భూములను కొని పేదలకు ఇళ్ల స్థలాలుగా ఇచ్చిన చరిత్ర సీఎం వైఎస్ జగన్ ప్రభుత్వానిదన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ఆచంట సత్యనారాయణ, డీసీసీబీ మాజీ డైరెక్టర్ సలాది అప్పారావు, మాజీ సర్పంచ్ సలాది వీరబాబు, ఆచంట వీరాస్వామి, హౌసింగ్ ఏఈ పీవీవీఎస్ ఎన్‌మూర్తి, వార్డు సభ్యులు వెలుగుబంటి ఏసుదాసు పాల్గొన్నారు.

టేకిలో గాంధీ విగ్రహం ఆవిష్కరణ


టేకిలో గాంధీ విగ్రహావిష్కరణలో ప్రముఖులు

కపిలేశ్వరపురం: టేకి గ్రామంలోని కాపుల దిమ్మ వద్ద బుధవారం మహాత్మాగాంధీ విగ్రహాన్ని ఆవిష్కరించారు. గ్రామంలోని కాపు సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విగ్రహాన్ని గ్రామ ప్రముఖులు చేతుల మీదుగా ఆవిష్కరించారు. గాంధీ మహనీయుని బోధనలు నేటి యువతకు ఆదర్శనీయమని వక్తలన్నారు.

అంగన్‌వాడీ పోస్టులకు నోటిఫికేషన్ విడుదల

కాజులూరు: మండలంలోని పలు గ్రామాల్లో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ సహాయకురాలి పోస్టులకు నోటిఫికేషన్ విడుదలైనట్టు తాళ్లరేవు ఐసీడీఎస్ సీడీపీఓ వి.మాధవి తెలిపారు. బుధవారం పత్రికలకు విడుదల చేసిన ఒక ప్రకటనలో పోస్టుల రిజర్వేషన్ కేటగిరి, దరఖాస్తుదారుల అర్హతలు తదితర వివరాలు వెల్లడించారు. కుయ్యేరు ఎస్సీ పేట అంగన్‌వాడీ కేంద్రం కార్యకర్త పోస్టు బీసీ–బీ కేటగిరికి, కొత్త మంజేరు–1 అంగన్‌వాడీ కేంద్రం సహాయకురాలి పోస్టు ఎస్టీ కేటగిరీకి, పాత మంజేరు అంగన్‌వాడీ కేంద్రం సహాయకురాలి పోస్టు ఎస్సీ కేటగిరీకి కేటాయించారన్నారు. పదో తరగతి ఉత్తీర్ణురాలై 1-7-2022కు 21 నుంచి 35 సంవత్సరాల మధ్య వయస్సు కలిగిన స్థానిక వివాహిత మహిళలు ఈ పోస్టులకు అర్హులన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు తాళ్లరేవు ఐసీడీఎస్ కార్యాలయం పని వేళల్లో దరఖాస్తు ఫారాలను తీసుకుని, పూర్తి చేసిన ఫారాలను అన్ని సర్టిఫికెట్ జెరాక్స్ కాపీలు గెజిటెడ్ సంతకంతో ఈ నెల 31వ తేదీ సాయంత్రం ఐదు గంటల్లోపు తమ కార్యాలయంలో అందజేయాలన్నారు.

27 నుంచి ఆధార్ నవీకరణ శిబిరాలు

కపిలేశ్వరపురం: ఈనెల 27 నుంచి 29 వరకూ మూడు రోజుల పాటు మండలంలోని వడ్లమూరు, వాకతిప్ప గ్రామాల సచివాలయాల్లో ఆధార్ నవీకరణ శిబిరాలను నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ ఎం.రామకృష్ణారెడ్డి తెలిపారు. శిక్షణ పొందిన డిజిటల్ అసిస్టెంట్లు మల్లేశ్వరరావు, దొరబాబులు ఆయా శిబిరాల్లో ఆధార్ నవీకరణ ప్రక్రియ చేపడతారన్నారు. ఆధార్ నంబరుకు సంబంధిత డాక్యుమెంట్లను జత జేయడం, పేరు, చిరునామా, వేలి ముద్రలను నవీకరించుకోవచ్చని ఎంపీడీఓ తెలిపారు.

శోభకృత్‌కు ఘన స్వాగతం

- వాడవాడలా ఉగాది వేడుకలు
- పంచాంగ శ్రవణాలు, పచ్చడి పంపిణీలు
- కిటకిటలాడిన ఆలయాలు

మండపేట: శోభకృత్ నామ సంవత్సరం తమకు అన్నింటి దిగ్విజయాలు కలగాలని కోరుకుంటూ ప్రజలు ఉగాది వేడుకలను బుధవారం ఘనంగా జరుపుకున్నారు. కొత్త సంవత్సరాదిని పురస్కరించుకుని ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. పంచాంగ శ్రవణాలతో కళకళలాడాయి. ఉగాది శుభాకాంక్షలు తెలుపుకుంటూ వేప పచ్చడిని అందరికి ఒకరికొకరు పంచుకున్నారు. పట్టణంలోని రథం గుడి, వేంకటేశ్వరస్వామివారి ఆలయం, శివాలయం, కొండపల్లి వారి వీధిలోని దుర్గమ్మ ఆలయం, ఏడిద రోడ్డులోని పెద్దమ్మ తల్లి ఆలయాల్లో తెల్లవారుజాము నుంచి భక్తులు పూజలు, అభిషేకాలు నిర్వహించారు. మండలంలోని ద్వారపూడిలోని అయ్యప్పస్వామివారి ఆలయం, అర్తమూరులోని వేంకటేశ్వరస్వామివారి ఆలయం, తాపేశ్వరం, ఇప్పనపాడు, కేశవరం, ఏడిద తదితర గ్రామాల్లోని ఆలయాలు భక్తులతో కిక్కిరిశాయి.

కనకదుర్గమ్మ వారి తీర్థ మహోత్సవం

అర్తమూరులోని కనకదుర్గమ్మ తీర్థ మహోత్సవం ఘనంగా జరిగింది. ఆలయ కమిటీ చైర్మన్, ఉప సర్పంచ్ కర్రి సత్యనారాయణరెడ్డి (జంబయ్య) ఆధ్వర్యంలో భక్తులు ఏర్పాట్లు చేశారు. అర్తమూరు, పరిసర గ్రామాల ప్రజలు పెద్ద ఎత్తున తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. సర్పంచ్ గొలుగూరి అన్నపూర్ణ, మండల మాజీ ఉపాధ్యక్షుడు విజయభాస్కర రెడ్డి దంపతులు, ఏపీ పౌల్ట్రీ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పడాల సుబ్బారెడ్డి, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ నల్లమిల్లి వీర్రెడ్డి, అర్తమూరు పరిసర గ్రామాల ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు.

కపిలేశ్వరపురం: మండలంలోని 19 గ్రామాల్లో బుధవారం ఉగాది పండగను సంతోషంగా జరుపుకున్నారు. పుణ్యస్నాన మాచరించి దేవతామూర్తుల ఆలయాలను సందర్శించారు. అంగరలోని వేణు గోపాలస్వామి ఆలయంలో వారణాసి వెంకటేశ్వరరావు పంచాంగ పఠనం చేశారు. గ్రామాల ప్రధాన సెంటర్లలో ప్రజా, సేవా సంఘాలు ఉగాది పచ్చడిని అందజేశారు.


ఉగాది వేడుకల వేదికపై రావిచెట్టు నీడన జ్యోతి ప్రజ్వలన చేస్తున్న మంత్రి వేణు

వైభవంగా నూకాంబిక అమ్మవారి జాతర

అంగర, కపిలేశ్వరపురంలలోని నూకాంబిక అమ్మవారి ఆలయాల వద్ద వైభవంగా తీర్థం నిర్వహించారు. అంగరలోని ఆలయం వద్ద గరగ నృత్యాలు, డప్పు వాయిద్యాలతో అమ్మవారి ఊరేగింపు నిర్వహించారు. అంగర, పడమర ఖండ్రిక గ్రామాల ఆడపడుచులు అమ్మవారికి నైవేద్యాన్ని సమర్పించారు. వెదురుమూడి, నల్లూరు, టేకి గ్రామాల భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు.

ఆకట్టుకున్న సంప్రదాయ ఏర్పాట్లు

రామచంద్రపురం రూరల్: ద్రాక్షారామ మాణిక్యాంబా సమేత భీమేశ్వరాలయంలో ఏర్పాటు చేసిన ఉగాది వేడుకల ఏర్పాట్లు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. సంప్రదాయానికి పెద్దపీట వేస్తూ ఆలయ ఈఓ పీటీవీవీ సత్యనారాయణమూర్తి(తారకేశ్వరరావు) నేతృత్వంలో ప్రత్యేక వేదికతో పాటు ఆలయం మొత్తం మామిడికాయలు, కొబ్బరి ఆకుల చిలకలతో అలంకరించిన తీరు ముచ్చటగొలిపింది. వేదిక వద్ద రావి చెట్టు, పూరి గుడిసె, ఎడ్ల బండి, మేలు జాతి ఆవులు వేదికకు తెలుగుదనాన్ని అద్దాయి. పలువురు సెల్‌ఫోన్‌లతో ఫోటోలు తీసుకుని సందడి చేశారు.

అలరించిన పంచాంగ పఠనం


గరిగిపాటి వెంకటభైరవ సుబ్రహ్మణ్య శాస్త్రి (మధు)ని సత్కరిస్తున్న బ్రాహ్మణ ట్రస్ట్ నాయకులు

రామచంద్రపురం: పట్టణంలోని గాయత్రీ బ్రాహ్మణ సమితి ట్రస్ట్, త్యాగరాజ సంగీత సభ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉగాది పంచాంగ పఠనం ఉగాది సంగీత వాహిని కార్యకమాలను గురువారం నిర్వహించారు. గాయత్రీ బ్రాహ్మణ సమితి ట్రస్ట్ అధ్యక్షులు విలాల్లరి కృపానందమూర్తి సభకు ఆహ్వానం పలికారు. తటవర్తి శ్రీనివాస్, ఆరాట్ల శ్రీధర్ తదితరులు త్యాగరాజస్వామి, గాయత్రీ మాత చిత్రపటాలకు పూల మాల వేసి జ్యోతి ప్రజ్వలన గావించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం అమ్మావజుల సీతారామయ్యతో పంచాగం పఠనం జరిపించారు. అనంతరం పొక్కులూరి రామచంద్రమూర్తి సౌజన్యంతో పట్టణ ప్రముఖ పురోహితుడు గరిగిపాటి వెంకటభైరవ సుబ్రహ్మణ్య శాస్త్రి(మధు)కి వేద పురోహితుల ఆశీర్వచనాలు, నూతన వస్త్రాలతో సత్కరించారు. ఆమంచి సుబ్రహ్మణ్య శాస్త్రి బృందం ఆధ్వర్యంలో ఉగాది సంగీత వాహిని ద్వారా సంగీత ప్రేక్షకులను అలరించారు. పెదపాటి సుభాష్‌చంద్రబోస్, భమిడిపాటి వెంకట సత్యనారాయణ మూర్తి, గాయత్రీ బ్రాహ్మణ ట్రస్ట్ సౌజన్యంతో సుమారు 30 మంది వృద్ధులకు ఉగాది నగదు పురస్కారాలు అందజేశారు. పూలపల్లి విజయకుమార్, తటవర్తి రాఘవరాజు, బులుసు సూర్యనారాయణ, తెలిదేవర రామారావు, చెల్లూరి అనంత పద్మనాభం, పొక్కులూరి సత్యనారాయణ తదితరులు ఈ కార్యక్రమ నిర్వహణకు సహకరించిన వారిలో ఉన్నారని నిర్వాహకులు తెలిపారు.

ఘనంగా ఉగాది పండగ

కాజులూరు: మండలంలోని గ్రామాల్లో బుధవారం ఆంధ్రుల తెలుగు సంవత్సరాది ఉగాది పండుగ కార్యక్రమాలను ప్రజలు ఘనంగా జరుపుకొన్నారు. శుభకృత్ నామ సంవత్సరానికి వీడ్కోలు పలికి శోభకృత్ నామ సంవత్సరానికి స్వాగతం పలుకుతూ ప్రతి ఇంటా షడ్రుచుల సమ్మేళనంతో ఉగాది పచ్చడి తయారు చేసుకుని ఆరగించారు. మామిడి తోరణాలు, పూల అలంకరణలతో ప్రతి ఇల్లు కళకళలాడాయి. ఒకరికొకరు పరస్పరం తెలుగు సంవత్సరాది, ఉగాది శుభాకాంక్షలు తెలుపుకొన్నారు. ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని గ్రామాల్లోని పలు ఆలయాల్లో పంచాంగ పఠనాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు.


అర్తమూరులో భక్తులతో కిటకిటలాడుతున్న కనకదుర్గమ్మ ఆలయం


అంగరలో పంచాంగ పఠనం చేస్తున్న వారణాసి


భీమేశ్వరాలయంలో ఎడ్లబండి

కల్యాణ రామునికి కాగితాలతో అలంకరణ

- నవమికి సిద్ధమవుతున్న సత్యవాడ
- తరతరాలుగా వస్తున్న సంప్రదాయం

కె.గంగవరం: శ్రీరాముని కల్యాణ మహోత్సవాన్ని తరతరాలుగా ఘనంగా నిర్వహిస్తూ జిల్లా సరిహద్దులు దాటి వినిపించేలా తన కీర్తిని చాటుకున్న కుగ్రామం సత్యవాడ. శ్రీరాముని కల్యాణ మహోత్సవం అంటే ప్రతి కుటుంబం తన సొంత ఇంటిలోని వివాహంలా భావించి మహాశివరాత్రి తదుపరి దినం నుంచి శ్రీరాముని కల్యాణం కోసం కళ్లల్లో ఒత్తులు వేసుకుని ఎదురుచూస్తూ స్వామి వారి అలంకరణకు రేయింబవళ్లు శ్రమించి తరతరాలుగా వస్తున్న తమ కళానైపుణ్యంతో శ్రీరామచంద్రుడిని అంగరంగ వైభవంగా అలంకరిస్తారు. రెక్కాడితే కాని డొక్కాడని వారి దైనందిన జీవితంలో కూడా పురుషోత్తముడైన శ్రీరామునికి తమ ఆధ్యాత్మిక చింతనను తెలియజేయడానికి వారు పడే తపనను చూస్తుంటే ఆలనాడు భద్రాచలంలో రామమందిర నిర్మాణానికి కంచర్ల గోపన్న పడిన కష్టాన్ని మించినదిగా మనకు తెలుస్తోంది. 150 ఏళ్ల చరిత్ర కలిగిన సత్యవాడ గ్రామస్తులు ఏటా ఉగాది రోజున శ్రీరాముని కల్యాణానికి రాటముహూర్తం చేస్తారు. అనంతరం చలువ పందిళ్లు వేసి వంశపారపర్యంగా వస్తున్న కళానైపుణ్యాన్ని కాగితపు పూలతో అలంకరించి ఆ శ్రీరామునికి తమ కళాత్మకతను నైవేద్యంగా సమర్పించుకుంటారు. వీరు తరతరాలుగా తమలోని కళా నైపుణ్యాన్ని శ్రీరామునికి నివేదిస్తూ తమలోని భక్తి భావాన్ని తెలియజేయడమే కాకుండా సమైక్యతా భావాన్ని నలుగురికీ పంచడంలో ముందు వరుసలో ఉన్నారు. 8 వేల మంది గ్రామ ప్రజల చేతి నైపుణ్యం 30 రోజుల ముందు నుండి అలంకరణ, 3 చలువ పందిళ్లు, ఏడు రోజుల పాటు అలంకరణ చేయడం వీరి ప్రత్యేకత. పిల్లలు, పెద్దలు, వృద్ధులు సైతం పాల్గొంటారు. కాగితపు పూల తయారీలో వీరిది అందెవేసిన చేయి. తమ గ్రామానికి ప్రత్యేక గుర్తింపు తీసుకురావాలని భద్రాచలంలో మాదిరిగానే ఏటా ఇక్కడ శ్రీరామనవమి మహోత్సవాలు ఘనంగా నిర్వహిస్తారు. ఈ వేడుక ద్వారా తమ గ్రామానికి పేరు ప్రతిష్ఠలు తీసుకురావాలనే ఉద్దేశంతో రంగురంగుల కాగితాలతో పువ్వులను తయారు చేసి వాటిని నవమికి వేసిన చలువపందిళ్లలో ఎంతో అందంగా అలంకరిస్తారు. ఆ విధంగా మొదలైన ఈ వంశపారంపర్య మహోత్సవాన్ని ఎన్ని వ్యయప్రయాసలు ఎదురైనా నేటికీ నిర్విరామంగా కొనసాగించడానికి, సంప్రదాయ కళలను మరుగున పడనీయకుండా వారు పడే తపన వెలకట్టలేనిది. కాగితపు పూలతో తయారు చేసిన చలువ పందిళ్లలో కల్యాణ రాముణ్ణి తిలకించేందుకు జిల్లా నలుమూలల నుంచి తరలి వచ్చే భక్తుల కోసం గ్రామస్తులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ నెల 30న జరిగే నవమి ఉత్సవానికి ఇప్పటికే దూరప్రాంతాల్లో ఉన్న బంధువులు ఇళ్లకు చేరారు.


చలువ పందిళ్లలో అలంకరించేందుకు సిద్ధం చేసిన కాగితం పువ్వులు


చలువపందిరిలో ఏర్పాటు చేయడానికి కాగితపు పువ్వుల తయారు చేస్తున్న చెరువు వీధి బాలభక్త భజన కమిటీ

లొల్లలో చిన్నారులకు ప్రతిభా పోటీలు


పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

రాయవరం: ఉగాదిని పురస్కరించుకుని మండలంలోని లొల్ల గ్రామంలోని విశ్వమానవత ఆశ్రమంలో బుధవారం విద్యార్థులకు ప్రతిభా పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా పాల్గొన్న యోగా గురువు వెలగల ఫణికృష్ణారెడ్డి మాట్లాడుతూ విశ్వమానవత సంస్థ విద్యార్థులకు సంస్కార విద్యను నేర్పించడం ద్వారా ఉత్తమ సమాజం నిర్మాణానికి బాటలు వేస్తోందన్నారు. విద్యార్థులకు సంస్కార విద్యను బోధిస్తున్న ఉపాధ్యాయులు గొలుగూరి మునిరెడ్డి, ఆంజనేయరెడ్డి, వలంటీర్లు సుజాత, వీరలక్ష్మిలను ఆయన అభినందించారు. ఉగాది పర్వదినం విశిష్టతను వివరించారు. తర్వాత విద్యార్థులకు గీత శ్లోకాల పోటీలు, 5,6 తరగతులకు టాలెంట్ టెస్ట్, చిత్రలేఖనం, వ్యాసరచన, యోగాసనాల పోటీలు, క్విజ్, వ్యక్తిత్వ వికాస శిక్షణ ఇచ్చారు. అనంతరం విజేతలకు బహుమతులను, ప్రశంసాపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ చాట్రాతి జానకి రాంబాబు, వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మిథాని ఇండిపెండెంట్ డైరెక్టర్‌గా చక్రపాణి

మండపేటలో సత్కారం

మండపేట: పట్టణానికి చెందిన వల్లూరి చక్రపాణికి అరుదైన గౌరవం దక్కింది. దేశ రక్షణ విభాగంలో కీలక సేవలందించే మిథాని సంస్థకు ఇండిపెండెంట్ డైరెక్టర్‌గా సేవలందించే అవకాశం లభించింది. ప్రస్తుతం చక్రపాణి విశాఖపట్నం కేంద్రంగా రాష్ట్రంలో విస్తరించియున్న వీబీసీ (వైజాగ్ బ్రాడ్ కాస్టింగ్ కంపెనీ ప్రయివేట్ లిమిటెడ్) సంస్థకు చైర్మన్‌గా ఉన్నారు. ఆర్‌ఎస్‌ఎస్‌లో క్రియాశీలకంగా వ్యవహరించేవారు. గత రెండేళ్లలో రాష్ట్రం నుంచి 14 మంది ఈ పదవికి ఎంపిక కాగా వారిలో చక్రపాణి ఒకరు. బాధ్యతలు చేపట్టిన అనంతరం మండపేట వచ్చిన అయనను పట్టణానికి చెందిన మండపేట పబ్లిక్ స్కూల్ (ఎంపీఎస్) విద్యాసంస్థల కరస్పాండెంట్ వల్లూరి చిన్నారావు, ఉపాధ్యాయులు, సిబ్బంది ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ దేశభక్తి, నిజాయితీ మెండుగా ఉన్న కొందరికి మాత్రమే లభించే ఈ అరుదైన అవకాశాన్ని పొందడం ద్వారా చక్రపాణి మండపేటకు మంచి గుర్తింపు తీసుకు వచ్చారన్నారు.


చక్రపాణిని సత్కరిస్తున్న ఎంపీఎస్ ఉపాధ్యాయులు

ఆత్మ నిర్భర్ భారత్ విజయవంతానికి కృషి

ప్రధాని నరేంద్ర మోదీ ఆశయానికి అనుగుణంగా ఆత్మనిర్భర్ భారత్ విజయవంతంగా అమలు చేయడమే తమ లక్ష్యమని చక్రపాణి పేర్కొన్నారు. రక్షణ రంగంలో విదేశీ పరికరాల దిగుమతులు తగ్గించి, స్వదేశీ ఉత్పత్తులు పెంచడంతో పాటు ఇతర దేశాలకు స్వదేశీ ఉత్పత్తుల ఎగుమతులకు తన వంతు పాత్ర పోషిస్తానని ఆయన తెలిపారు.

మత్స్యకారుల సంక్షేమానికి అధిక ప్రాధాన్యం

మండపేట: మత్స్యకారుల సంక్షేమానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని ఎంపీపీ వుండమట్ల శ్రీనివాస్ అన్నారు. ఉపాధి అవకాశాలు మెరుగుపర్చడం ద్వారా వారి అభ్యున్నతికి తోడ్పాటును అందిస్తోందన్నారు. మండలంలోని కేశవరం గనిపోతురాజు చెరువు వద్ద మండల పరిషత్ నిధులు రూ.7 లక్షలతో నిర్మించే చేపల షెడ్డుకు బుధవారం ఎంపీపీ శ్రీనివాస్ భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గనిపోతురాజు చెరువు గట్టు వద్ద దాదాపు 50 మంది మత్స్యకారులు చేపల అమ్మకాలు చేస్తూ జీవనోపాధి పొందుతున్నారన్నారు. ఇక్కడ ఏ విధమైన షెడ్డు లేకపోవడంతో ఎండకు ఎండుతూ వానకు తడుస్తూ మత్స్యకారులు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోందన్నారు. ఫిషెర్‌మన్ సొసైటీ వారు సమస్యను ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు దృష్టికి తీసుకురాగా ఆయన వెంటనే స్పందించి నిధుల మంజూరుకు అధికారులకు ఆదేశాలిచ్చారని ఎంపీపీ శ్రీనివాస్ పేర్కొన్నారు. షెడ్డు నిర్మాణ పనులు చేపట్టడంపై ఫిషర్‌మెన్ సొసైటీ నాయకులు కొల్లి సుబ్రహ్మణ్యం, చుక్కా అచ్చారావు, గండిమేను గోవింద్, చుక్కా శ్రీరాములు మాట్లాడుతూ ఎమ్మెల్సీ తోటకు కృతజ్ఞతలు తెలిపారు. వైఎస్సార్ సీపీ నాయకులు కొప్పిరెడ్డి ప్రసాద్, గంధం సూరిబాబు, సత్తిబాబు, సమతం పాపారావు, కంచిమూర్తి ప్రసాద్, నాటిపాము గోవింద్, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.


షెడ్డు నిర్మాణ పనులకు భూమిపూజలో ఎంపీపీ శ్రీనివాస్ తదితరులు

డిమాండ్ల సాధనకు పోరాటాలకు సిద్ధం కావాలి


నాగేశ్వరరావును సత్కరిస్తున్న గ్రామీణ తపాలా ఉద్యోగులు

మండపేట: కేంద్ర ప్రభుత్వం మెడలు వంచి న్యాయమైన డిమాండ్లు సాధించుకునేందుకు పోస్టల్ ఉద్యోగులు పోరాటాలకు సన్నద్ధం కావాలని పోస్టల్ అండ్ టెలిగ్రాఫ్ ఎంప్లాయిస్ కో–ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ కార్యదర్శి దేవిరెడ్డి శివనాగేశ్వరరావు కోరారు. స్థానిక విజయలక్ష్మి నగర్‌లో బుధవారం జరిగిన పోస్టల్ ఉద్యోగుల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. గ్రామీణ తపాలా ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు వైస్ స్వర్ణరాజు అధ్యక్షతన జరిగిన సమావేశంలో నాగేశ్వరరావు మాట్లాడుతూ టార్గెట్ల పేరిట అధికారులు గ్రామీణ తపాలా ఉద్యోగులను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. డిపార్ట్‌మెంట్ ఉద్యోగులు, పెన్షనర్లు వారికి సహకరించాలని కోరారు. గుంటూరు జిల్లా మాజీ ఏఐజీడీఎస్‌యూ కార్యదర్శి డి అప్పారావు, ఎస్‌ఎఫ్‌సీఈ నేత కొండపల్లి సూర్యనారాయణ, జీడీఎస్ ఉద్యోగుల కార్యదర్శి ఎస్‌వీవీ మునేశ్వరరావు తదితరులు ప్రసంగించారు. అనంతరం నాగేశ్వరరావు, డీవీ అప్పారావు, సూర్యనారాయణలను యూనియన్ నాయకులు ఘనంగా సత్కరించారు. పి.అమ్మిరాజు, టి.వుల్లేశ్వరరావు, చెల్లుబోయిన శ్రీనివాస్, పిల్ల నాగేశ్వరరావు, గంద్రోతు రామకృష్ణ, మల్లె మొగ్గల సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పండగలు సంస్కృతికి ప్రతీకలు

రాయవరం: పండగలు మన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకలని, ముఖ్యంగా తెలుగువారి తొలి పండుగ ఉగాదికి ప్రత్యేక స్థానం ఉందని వెదురుపాక విజయదుర్గా పీఠాధిపతి వాడ్రేవు వెంకటసుబ్రహ్మణ్యం(గాడ్) అన్నారు. పీఠంలో బుధవారం ఉగాది వేడుకలు నిర్వహించారు. హాజరైన భక్తులనుద్దేశించి పీఠాధిపతి గాడ్ మాట్లాడుతూ తెలుగు పదానికి ఉగాది ఆయువు పట్టు అని అన్నారు. పీఠానికి వచ్చిన భక్తులు విజయదుర్గా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పీఠంలో ఆస్థాన కవి గొర్తి వెంకటసుబ్రహ్మణ్యం పంచాంగ పఠనం చేశారు.

వసంత నవరాత్రులు ప్రారంభం

విజయదుర్గా పీఠంలో ఆదివారం వసంత నవరాత్రి వేడుకలు ప్రారంభమయ్యాయి. విజయదుర్గా అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని వసంతమాతగా అలంకరించి పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఈ నెల 30వ తేదీ వరకు ఈ ఉత్సవాలు నిర్వహించనున్నట్టు పీఠం పీఆర్వో వాడ్రేవు వేణుగోపాల్ తెలిపారు. మూడురోజుల పాటు దుర్గాదేవి, మరో మూడు రోజులు లక్ష్మీదేవి, మరో మూడు రోజులు సరస్వతీదేవిగా విజయదుర్గాదేవికి పూజలు చేయనున్నట్లు ఆయన తెలిపారు. ఉగాది వేడుకలను పురస్కరించుకుని పీఠంలో శ్రీ, భూ సమేత విజయ వెంకటేశ్వరస్వామి వారికి లక్షతులసి పూజను నిర్వహించారు. విజయదుర్గా అమ్మవారిని నయనానందకరంగా అలంకరించి పీఠబ్రహ్మ చీమలకొండ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి హాజరైన భక్తులు సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు.


భక్తులనుద్దేశించి మాట్లాడుతున్న పీఠాధిపతి గాడ్

లోగిళ్లలో సందడి

తెలుగువారి తొలి పండుగ ఉగాది పర్వదినంతో జిల్లాలో లోగిళ్లు సందడి సందడిగా మారాయి. జనం ఆలయాలకు వెళ్లి పూజలు, అభిషేకాలు నిర్వహించారు. షడ్రుచుల మేళవింపుతో కూడిన ఉగాది పచ్చడిని ప్రతి ఒక్కరూ ఆస్వాదించారు.

ఘనంగా అమ్మవార్ల సంబరాలు

రామచంద్రపురం రూరల్: మండలంలోని ద్రాక్షారామ గ్రామ దేవతలు తలుపులమ్మ, ముత్యాలమ్మ అమ్మవార్ల తీర్థం, సంబరాలు బుధవారం ఘనంగా నిర్వహించారు. తలుపులమ్మ అమ్మవారిని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, రామచంద్రపురం మున్సిపల్ చైర్‌పర్సన్ గాధంశెట్టి శ్రీదేవి, వైస్ ఎంపీపీ నరాల రాజ్యలక్ష్మి, నియోజకవర్గ శెట్టిబలిజ సంఘం అధ్యక్షుడు నరాల ఏడుకొండలు, రాష్ట్ర ఇండస్ట్రియల్ కార్పొరేషన్ డైరెక్టర్ వాసంశెట్టి శ్యామ్, పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు దర్శించుకున్నారు. శక్తి వేషాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. అమ్మవారికి కుంకుమ పూజలు నిర్వహించారు. ముత్యాలమ్మ ఆలయం వద్ద సిరిమానోత్సవం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గ్రామ సర్పంచ్ కొత్తపల్లి అరుణ, ఉప సర్పంచ్ పెన్నాడ బుచ్చిరాజు, వైస్ ఎంపీపీ శాకా బాబీ తదితరులు పాల్గొన్నారు.


ద్రాక్షారామ బియ్యంపేటలో తలుపులమ్మ అమ్మవారిని దర్శించుకున్న మంత్రి వేణు

గుండెపోటుతో వీఆర్‌ఓ మృతి

కె.గంగవరం: మండల పరిధిలోని పాణింగపల్లి వీఆర్‌ఓ పెందుర్తి బాబూరావు(52) గుండెపోటుతో బుధవారం మృతిచెందారు. అందరితో కలుపుగోలుగా ఉండే వీఆర్‌ఓ అకాలంగా మృతి చెందడంతో పాణింగపల్లిలో విషాద ఛాయలు అలుముకున్నాయి. విలేజ్ రెవెన్యూ ఆఫీసర్స్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లేష్ బాబురావు కుటుంబాన్ని పరామర్శించారు. వీఆర్‌ఓ మృతి పట్ల తహసీల్దార్ వైద్యనాథ్ శర్మ, సర్పంచ్ చీకట్ల సునీత, వైస్ ఎంపీపీ మధుబాల, ఎంపీపీ పంపన నాగమణి సంతాపం ప్రకటించారు.


బాబూరావు (ఫైల్)